క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


కెరటం ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

బొండపల్లి: మండలంలోని కెరటాం, దేవుపల్లి గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను విజిలెన్స్ సీఐ బి. సింహాచలం ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల స్టాకుతో పాటు రికార్డులను పరిశీలించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని డీలర్లకు సూచించారు. తనిఖీలో ఏపీ మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు..


నదిలో దిగి విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపడుతున్న సిబ్బంది

జామి: గోస్తనీ నది ఉధృతంగా ప్రవహిస్తున్నప్పటికీ విద్యుత్ శాఖాధికారులు, సిబ్బంది విధులు నిర్వహించి సరఫరా పునరుద్ధరించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల కురిసిన వర్షాలకు తాండ్రంగి వద్ద గోస్తనీ నది మీదుగా వెళ్తున్న విద్యుత్ తీగలపై భారీ వృక్షం కూలిపోయింది. దీంతో లైన్‌మన్ వెంకటరావు, తదితర సిబ్బంది బుధవారం నదిలోకి దిగి మరీ మరమ్మతులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు సిబ్బందిని అభినందించారు.

డ్రోన్ వినియోగంపై అవగాహన


ఎం.కె.వలసలో డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ పూర్ణిమ

జామి: మండలంలోని ఎం.కె వలసలో ఏఓ ఎం.పూర్ణిమ ఆధ్వర్యంలో రైతులకు డ్రోన్ వినియోగంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నానో ఎరువులను విరివిగా వినియోగించాలని సూచించారు. 500 ఎం.ఎల్ నానా యూరియా ఒక బస్తా యూరియాతో సమానమని చెప్పారు. డ్రోన్ ద్వారా ఎరువులు పిచికారీ చేయడం వల్ల సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ షేక్ అహ్మద్, వీపీఏ షేక్ కరీం, సర్పంచ్ సంతోష్, మాజీ సర్పంచ్ స్వామినాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎన్నింటి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

7,8 తేదీల్లో సీఐటీయూ మహాసభలు


మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): ఈ నెల 7,8 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు గరివిడిలో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో జరగనున్న సభలకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంబళ్ల గౌరినాయుడు, మండల అధ్యక్షుడు జె.విశ్వనాథరాజు, ఓఎస్ఎన్ మూర్తి, సలీం, గంట్యాడ అప్పలరాజు, జగదీష్, ప్రకాష్, కేవీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన


కాలం రాజుపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ కిరణ్‌కుమార్

గజపతినగరం: వరి చిరు పొట్టదశలో ఉన్నప్పుడు మల్లీ కె ఎరువు పిచికారీ చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి. కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని సీతారామపురం, కాలం రాజుపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లీ కె ఎరువు వేయడం వల్ల తెగుళ్లు దరి చేరవన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి నానో యూరియా, నానో డీఏపీలను వాడాలని సూచించారు. కార్యక్రమంలో కాలంరాజుపేట సర్పంచ్ గేదెల ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

అధ్వాన రహదారులతో అవస్థలు

- అడుగుకో గుంత
- రాకపోకలకు తప్పని అవస్థలు
- చినుకు పడితే ఆందోళనలో ప్రజలు


అధ్వానంగా ఏఆర్ పేట రహదారి


తెలగాపాలెం రహదారిపై గోతుల్లో చేరిన నీరు


భీమసింగి బ్రిడ్జిపై ఏర్పడిన గోతులు


భీమసింగి వద్ద చెరువును తలపించేలా ఉన్న రహదారి


ఏఆర్ పేట ఆర్‌యూబీలో చేరిన నీరు

జామి: మండలంలోని పలు రహదారులు అధ్వానంగా మారాయి. ఆయా రహదారుల మీదుగా రాకపోకలు సాగించాలంటనే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా చీకటి పడినా.. చినుకు పడినా.. ప్రమాదాల బారిన పడక తప్పదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రహదారులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని గొప్పలు చెప్పారు. కాని ఆచరణలో చేసి చూపించలేకపోయారు. మండలంలో భీమసింగి – అన్నంరాజుపేట రహదారి పూర్తిగా గోతులతో నిండిపోయింది. రహదారి మధ్యలో ఆర్‌యూబీ ఉంది. వర్షాలు కురుస్తుండడంతో ఆర్‌యూబీ కింద వర్షపు నీరు చేరి చెరువును తలపిస్తోంది. దీంతో ప్రతిరోజూ ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే భీమసింగి – కొత్తవలస ప్రధాన రహదారిలో భీమసింగి వద్ద ప్రధాన రహదారి పూర్తిగా పాడైంది. ఎక్కడికక్కడే గోతులేర్పడ్డాయి. భీమసింగి – విజయనగరం – భీమసింగి ఫ్లై ఓవర్ కూడా గోతులతో ప్రమాదకరంగా తయారైంది. అధికారులు, పాలకులు స్పందించి రహదారులను అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

- వైఎస్సార్‌సీపీ నాయకుడు మహంతి రమణ


కొత్తగా ఎన్నికైన యువజన నాయకుడికి నియామక పత్రం అందజేస్తున్న బూత్ ఇన్‌చార్జ్ రమణ

బొండపల్లి: వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆ పార్టీ మండల బూత్ ఇన్‌చార్జ్ మహంతి రమణ అన్నారు. మండలంలోని అంబటివలసలో వైఎస్సార్‌సీపీ గ్రామ విభాగ కమిటీలను ఎన్నుకున్నారు. గ్రామ యువజన విభాగం అధ్యక్షుడిగా పాలూరి రామ స్వామినాయుడును ఎన్నుకున్నారు. అలాగే కమిటీ సభ్యులను కూడా ఎంపిక చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.రాము, ఎంపీటీసీ సభ్యులు తాళ్లపూడి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

మెరకముడిదాం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్టణానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి యాజమాన్యం, సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ సౌజన్యంతో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు క్యాంప్ జూనియర్ మేనేజర్ సీహెచ్ వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంఘటనా స్థల పరిశీలన


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి, తదితరులు

గజపతినగరం రూరల్: మండలంలోని కొత్త బగ్గాం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన హత్యకు సంబంధించి దర్యాప్తు నిమిత్తం బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి బుధవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్య జరిగిన తీరు.. హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పరిశీలనలో సీఐ రమణ, ఎస్సై కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు

ధర్మవరంలో 'పొలం పిలుస్తోంది'


ధర్మవరంలో నానో యూరియా స్ప్రేయింగ్ చేయిస్తున్న ఎ.డి భానులత, తదితరులు

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఎ.డి భానులత మాట్లాడుతూ.. యూరియాకు బదులు నానో యూరియా వాడడం వల్ల మొక్కలకు నేరుగా నత్రజని అందుతుందన్నారు. దీంతో పంట ఏపుగా పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రవీంద్ర, వీపీఏ గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

నానో యూరియా వినియోగించాలి..

వేపాడ: ఖరీఫ్ సీజన్‌లో పంటలు పండించే రైతులు యూరియాకు బదులు నానో యూరియా వినియోగించాలని ఏఓ స్వాతి తెలిపారు. మండలంలోని ముకుందపురం, ఓబలయ్యపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

జీవాలకు అందని వైద్యం


మృతి చెందిన పొట్టేలుతో రైతు సత్యం

జామి: మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో పశువులు, మూగజీవాలకు సరైన వైద్యసేవలు అందడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సిబ్బంది నిర్లక్ష్యంతో రైతులు, పాడి, జీవాల పెంపకందారులు ఇబ్బంది పడుతున్నారు. రామయ్యపాలెం గ్రామానికి చెందిన పి.చినసత్యం తన పొట్టేలుకు బాగోలేకపోవడంతో బుధవారం ఉదయం పశువుల ఆస్పత్రికి వచ్చాడు. తొమ్మిది గంటల నుంచి పదకొండున్నర వరకు వేచిచూసినా సిబ్బంది రాలేదు. సకాలంలో వైద్యం అందకపోవడంతో పొట్టేలు మృతి చెందింది. దీంతో చినసత్యం కన్నీరు మున్నీరుగా విలపించాడు. ఈ విషయమై పశు వైద్యాధికారి సంతోష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. తాను సెలవులో ఉన్నట్లు తెలిపారు. సిబ్బంది వైద్యం అందించారని, అయితే ఆస్పత్రికి వచ్చేసరికే పొట్టేలు ఆరోగ్య పరిస్థితి విషమించిందని చెప్పారు.

బీమాతో ధీమా..


బ్యాంక్ సేవలు, బీమా పథకాలపై వివరిస్తున్న బీఎం సునీత

వేపాడ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలతో ఖాతాదారులకు ధీమా లభిస్తుందని ఏపీజీబీ వేపాడ బ్రాంచ్ మేనేజర్ సునీత తెలిపారు. బక్కునాయుడుపేటలో బుధవారం నిర్వహించిన ఖాతాదారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకంలో సంవత్సరానికి 436 రూపాయలు చెల్లిస్తే సాధారణ మరణానికి రూ. 2 లక్షలు.. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం ద్వారా రూ. 20 చెల్లిస్తే ప్రమాదవశాత్తూ మరణిస్తే బాధిత కుటుంబానికి రెండు లక్షల రూపాయల బీమా అందిస్తామన్నారు. అలాగే తక్కువ వడ్డీకే బంగారు ఆభరణాలపై రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ అరుణ్‌గోపాల్, సిబ్బంది మహేష్, ఖాతాదారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు


వేపాడ: బానాదిలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు


దత్తిరాజేరు: ఎస్ చింతలవలసలో అన్న ప్రసాదం అందజేస్తున్న కమిటీ సభ్యులు

వేపాడ: మండలంలోని పలు గ్రామాల్లో గణనాథుని నవరాత్రుల సందర్భంగా బుధవారం అన్నసమారాధనలు నిర్వహించారు. బానాదిలో బాల గణేష్ యూత్ సభ్యులు, గ్రామపెద్దల సమక్షంలో అన్నదానం చేపట్టారు. అలాగే వేపాడలోని మర్రిచెట్టు వద్ద.. జాకేరులో అన్నదానాలు నిర్వహించగా.. వందలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు.

ఎస్ చింతలవలసలో..

దత్తిరాజేరు: మండలంలోని ఎస్. చింతలవలసలో సర్పంచ్ కంది పద్మావతి, మాజీ ఎంపీపీ తిరుపతి నాయుడు దంపతుల ఆధ్వర్యంలో భా అన్న సమారాధన నిర్వహించారు. సుమారు రెండు వేల మంది భక్తులు పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు.

చతుర్విధ ప్రక్రియలు చేయించండి

వేపాడ: విద్యార్థులచే ఇంగ్లిష్, తెలుగు చదివించడం, రాయించడంతో పాటు చతుర్విధ ప్రక్రియలు చేయించాలని ఎంఈఓ బాలభాస్కరరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని చాముండేవి అగ్రహారం, వెల్దాం ప్రాథమిక పాఠశాలలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించడంతో పాటు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీ సునంద పాల్గొన్నారు.

పునరుత్పత్తిపై దృష్టి

వేపాడ: రైతాంగం పశువుల్లో పునరుత్పత్తిపై దృష్టి సారించినప్పుడే పాడి అభివృద్ధి చెందుతుందని పశు వైద్యాధికారి కె. గాయత్రి అన్నారు. మండలంలోని నల్లబిల్లిలో పశు వైద్యశిబిరం నిర్వహించి పశువులకు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పశువైద్యశాఖ సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

వితరణ


సౌండ్ బాక్సును వితరణగా అందజేస్తున్న గణేష్ కుటుంబికులు

వేపాడ: మండలంలోని వల్లంపూడి ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన శానాపతి గణేష్ మౌత్‌తో కూడిన సౌండ్ బాక్స్ బుధవారం వితరణగా అందజేశారు. వల్లంపూడి పంచాయతీ మాజీ సర్పంచ్ శానాపతి తాతారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు గణేష్, కుటుంబ సభ్యులు సౌండ్ బాక్సు ఇచ్చారు. దీంతో దాతలకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సమయానికి గుడ్లు ఇవ్వాలి

శృంగవరపుకోట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే కోడిగుడ్లు లబ్ధిదారులకు సమయానికి ఇవ్వాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి టి. విమలారాణి సూచించారు. ఎస్.కోట ప్రాజెక్ట్ పరిధిలోని గోపాలపల్లి, ధర్మవరం గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిబ్బంది సమయ పాలన పాటించడంతో పాటు లబ్ధిదారులకు మెనూ ప్రకారం సరుకులు ఇవ్వాలన్నారు. అనంతరం ఎస్.కోట ఐసీడీఎస్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఆమె వెంట ఎస్.కోట సీడీపీఓ అచ్యుత, తదితరులున్నారు.


గుడ్లు, పాల ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న పీడీ విమలారాణి

రైతుల పక్షాన పోరాడుదాం..


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలపై రైతుల పక్షాన నిలిచి పోరాటం చేద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల కోసం రైతులు ఎదుర్కొంటున్న అవస్థలను గుర్తించిన వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 9న రెవెన్యూ డివిజన్ల స్థాయిలో ధర్నాలు నిర్వహించాలన్నారు. ఆ రోజున చీపురుపల్లిలో నిర్వహించనున్న ధర్నాకు సంబంధించి పీఏసీ మెంబర్, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లతో పాటు చీపురుపల్లి, రాజాం నియోజకవర్గాల ముఖ్య నేతలతో బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో భాగంగా నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఆ రోజు ఉదయం పది గంటలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పార్టీ కార్యాలయం వద్దకు చేరుకోవాలని సూచించారు. అక్కడ నుంచి ర్యాలీగా బయలుదేరి ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని ఎరువు కష్టాలపై ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్లు ఎస్‌వీ రమణ రాజు, కేవీ సూర్యనారాయణరాజు, శ్రీకాకుళం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్, రెండు నియోజకవర్గాల ముఖ్య నాయకులు ఇప్పిలి అనంతం, మీసాల వరహాలనాయుడు, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, బెల్లాన వంశీకృష్ణ, మీసాల విశ్వేశ్వరరావు, వాకాడ శ్రీనివాసరావు, గుడివాడ శ్రీరాములు, పొట్నూరు సన్యాసినాయుడు, శీర అప్పలనాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, కోట్ల వెంకటరావు, తాడ్డి వేణు, బూర్లె నరేష్, సురేష్ ముఖర్జీ, రాజగోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నిధుల్లేక దీనావస్థలో పంచాయతీలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నాయకుడు అనంతం

చీపురుపల్లి: జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీల్లో నిధులు లేక గ్రామాలు దీనావస్థలో ఉన్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతరం అన్నారు. ఈ విషయంలో పంచాయతీరాజ్ మంత్రి పవన్ కల్యాణ్ కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు జనరల్ ఫండ్స్ నిధులు కూడా ఏడాది కాలంగా విడుదల కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు వస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం వాటిని ఇతర పనులకు మళ్లించడంతో గ్రామాల్లో కనీసం పారిశుధ్య పనులు నిర్వహించలేని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ శాఖా మంత్రి పవన్‌కల్యాణ్ నిధుల విడుదలపై శ్రద్ధ చూపాలని కోరారు.

జెడ్పీ చైర్మన్ జన్మదినం..

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు ఈ నెల 5న ఘనంగా నిర్వహించనున్నట్లు అనంతం తెలిపారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, వలంటీర్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి దన్నాన జనార్దనరావు, పార్టీ నాయకులు పతివాడ రాజారావు, గిరడ రాందాసు, గవిడి సురేష్, కోరుకొండ దాలయ్య, ముల్లు పైడిరాజు, కర్రోతు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం



డ్రగ్స్ నివారణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, ర్యాగింగ్ కేసులో పట్టుబడితే జీవితాలు నాశనం అవుతాయని ఆర్డీఓ బి.ఆశయ్య అన్నారు. గరివిడి అవంతీ సెయింట్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ జె.బాల భాస్కరరావు ఆధ్వర్యంలో ర్యాగింగ్ నివారణ, మాదకద్రవ్యాల నియంత్రణపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపైనే శ్రద్ధ వహించాలన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను చిన్నాభిన్నం చేసుకోవద్దని సూచించారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. అనంతరం ర్యాగింగ్ నిరోధక చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ నివారణపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజు, ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం, సీఐ జి.శంకరరావు, ఎస్సై బి.లోకేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా భూములు మాకు ఇప్పించండి

- అధికారులను కోరిన జిందాల్ నిర్వాసితులు


జిందాల్ నిర్వాసితుల నుంచి వినతి తీసుకుంటున్న డిప్యూటీ కలెక్టర్ మురళి, తదితరులు

శృంగవరపుకోట: జిందాల్ భూ సేకరణలో తమకు అన్యాయం జరిగిందని.. తీసుకున్న భూములను తమకు వెంటనే అప్పగించాలని జిందాల్ నిర్వాసితులు కోరారు. ఈ మేరకు డిప్యూటీ కలెక్టర్ ఇ.మురళికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని మూలబొడ్డవర సచివాలయంలో డిప్యూటీ కలెక్టర్ నేతృత్వంలో బుధవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. తీసుకున్న భూములకు పరిహారం ఇవ్వలేదని.. భూ సేకరణలో సర్వే నంబర్లు సక్రమంగా పడలేదని.. భూ ఆక్రమణలు.. చెట్లు నరికివేత, తదితర అంశాలపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయి. ఎమ్మెల్సీ రఘురాజు హాజరై జిందాల్ నిర్వాసితుల సమస్యను వివరించారు. దీనికి డిప్యూటీ కలెక్టర్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, సహా పలువురు రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.